

# జంట ఏనుగుల హల్‌చల్



- పంట పొలాలపై దాడి

**ప్రజాశక్తి-రామకుప్పం:** మండలంలోని ముద్దనపల్లి, బిరుగుండ్లపల్లి గ్రామాల్లోని అటవీ శివారు ప్రాంతాల్లో జంట ఏనుగులు హల్‌చల్ చేశాయి. సోమవారం రాత్రి పలువురు రైతులకు చెందిన వరి, టమోట, మిరప, పంటలను తిన్నంత తిని, తొక్కి నాశనం చేశాయి. వ్యవసాయ పరికరాలను ధ్వంసం చేశాయి. వేలల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు ఏనుగులు అటవీ లోతట్టు ప్రాంతాలకు మళ్ళిచ్చేందుకు టపాకాయలు, బాణాసంచా పేల్చి విశ్వప్రయత్నం చేశారు. పంటలపై ఏనుగులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని అటవీ ప్రాంత ప్రజలు, బాధిత రైతులు కోరుతున్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిద్దాం: కలెక్టర్




**ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:** జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి బాధ్యతతో పనిచేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. మంగళవారం స్థానిక జెడ్పీ సమావేశం మందిరంలో ఎస్పీ జాషువ, జెసీ శ్రీనివాసులుతో కలసి ఎన్నికలు ఎన్నికల నామినేషన్ల స్వీకరణ, పోస్టల్ బ్యాలెట్స్, ఎంసీసీ, ఎలక్షన్ వ్యయం మెనేజ్‌మెంట్, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టి, విఎస్‌టి, వివిటి ఇంకా నిర్వర్తించాల్సి బాధ్యలపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై అధికారులు దిశానిర్దేశం చేశారు.

## మహిళా మార్ట్‌లో సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులు

**ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:** సేంద్రీయ వ్యవసాయ పద్ధతులులో పండించిన పంట ఉత్పత్తులు వినియోగించడం వలన ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని జిల్లా అదనపు పథక నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం చిత్తూరు డివిజన్ పరిధిలోని తవణంపల్లి మండలంలో వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లో ఎటువంటి క్రిమిసంహారక మందులు వాడకుండ సేంద్రీయ పద్ధతులలో పండించిన బియ్యం, రాగులు, పసుపు, బెల్లం, ఉలవలు, కందిపప్పు ఉత్పత్తుల విక్రయాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం రవి, చేయూత మహిళా మార్ట్ ఏపీఎం దేవసేన, ఐసీటీ యన్‌యఫ్ఏ మహేష్, మార్కెటింగ్ నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ పైజున్నిషా, యూనిట్ ఇంచార్జ్ సరిత, ప్రమీల ఐసీఆర్‌పిలు పాల్గొన్నారు.

## సరిహద్దు చెక్‌పోస్టులో 4కిలోల బంగారం పట్టివేత

**ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్:** మండలంలోని తడుకుపేట చెక్‌పోస్టు వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీలో నగరి సీఐ సురేష్, రెవిన్యూ సిబ్బంది 4కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. దీనిపై సీఐ మాట్లాడుతూ చెన్నై నుంచి తిరుపతికి వెళుతున్న వాహనంలో స్వాధీనం చేసుకున్న నగలకు సంబంధిత బిల్లులు ఉన్నాయిని అయితే బంగారం వివరాలను జీఎస్టీ అధికారులకు తెలపడం జరిగిందని వారి పరిశీలన అనంతరం బంగారం వ్యాపార పరమైందా లేదా అన్న అంశాన్ని నిర్ధారించుకొని కేసు నమోదుచేస్తామన్నారు.

# చిత్తూరు అభివృద్ధి గుర్తుకొచ్చిందోచ్..

- హడావుడిగా శంకుస్థాపనలు
- జిల్లా అంతటా 'పెద్ద'ఎత్తున ఆర్భాటాలు
- సుడిగాలి పర్యటనలతో అమాత్యులు బిజీబిజీ

**ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:** కోడ్ కూతకు కాస్తంత సమయమే ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ఏర్పాట్లలో అధికారులంతా హడావుడిగా ఉన్నారు. దాదాపుగా బదిలీలన్నీ అపోయినట్లే తెలుస్తోంది. ఎన్నికల కోడ్ అమలైంది మొదలు నియమావలిని తప్పక పాటించాల్సి ఉంటుంది. అధికారులంతా పూర్తి స్థాయిలో ఎన్నికల కమీషన్ పరిధిలోకి వెళ్లిపోతారు. కాగా అమాత్యులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు గత హామీలు ఒక్కసారిగా గుర్తొచ్చినట్లు తెలుస్తోంది. అంతే అధికారులను వెంటబెట్టుకొని ఊరూవాడ.. నగరాల్లోనూ పర్యటిస్తూ పెద్ద ఎత్తున శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేస్తున్నారు. శంకుస్థాపనల పేరిట కోటాను కోట్లకు లెక్కలు చెబుతూ సుడిగాలి పర్యటనలు చేపడుతున్నారు. ఐదేళ్లుగా గుర్తుకు రాని అభివృద్ధి పది రోజుల్లో ఎందుకిలా అని సాధారణ ప్రజల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయం.

### సుడిగాలి పర్యటనలు.. ఆర్భాటాలు..

అభివృద్ధి పనులకు గణాంకాలు చెబుతూ.. ఇచ్చిన సంక్షేమ పథకాలను వివరిస్తూ 'వై ఏపీ నీడ్స్ జగన్' అంటూ గ్రామాల్లో ఇప్పటికే కార్యక్రమాలను చేపట్టారు. అయితే ఎన్నికల కోడ్ సమీపిస్తున్న వేళ పలు అభివృద్ధి పనులంటూ శంకుస్థాపనలు జోరుగా చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు, రొంపిచర్ల, పలమనేరు, కాణిపాకం, చిత్తూరు ప్రాంతాల్లో కోట్లాది రూపాయలతో రూపొందించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మరికొన్ని చోట్ల ప్రారంభోత్సవాలూ చేశారు.

### అభివృద్ధి 'చుడా' అంకెలుండు.!

చిత్తూరు అర్బన్ డెవెలప్మెంట్ అసొసియేషన్(చుడా) పరిధిలో అభివృద్ధిపై అకస్మాత్తుగా అధికార పార్టీకి ఎందుకు గుర్తొచ్చిందోనని నగర వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా ఉన్న పాలకులు అభివృద్ధి పనులు, నగర ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించారనే విమర్శలు ఉన్నాయి. దీనికి తోడు ఇన్నాళ్లూ పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధుల వెంట అమాత్యులు, ఇతర నాయకులు చిత్తూరు నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి, మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో పెద్దగా చర్యలు లేవని స్థానికులంటున్నారు. కాగా ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార పార్టీలో కొత్త అభ్యర్థులు తెరమీదకు రావడంతో చుడా పరిధిలో అభివృద్ధిపై కోట్ల రూపాయల అంకెల గారడితో శంకుస్థాపనలు చేస్తుండటంపై నగర వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇనాళ్లూ నగరం వైపు కన్నెత్తి చూడని నేతలంతా హడావుడి చేస్తుండటాన్ని చూసి విస్తుపోతున్నారు.




## రూ.5.95కోట్ల పనులకు భూమి పూజ



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

**ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:** చుడా పరిధిలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూమి పూజ చేశారు. చుడా పరిధిలోని సంతపేట వద్ద రూ.30లక్షలతో చిన్నపిల్లల పార్కు, కోడిగుంట వద్ద ఎంఐజిలేలో రూ.5.65కోట్లతో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ ఫేస్-1 పనులకు మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేపడతామని ఆయన స్పష్టం చేశారు. చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ చుడా పరిధిలో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ ఫేజ్-1లో భాగంగా చిత్తూరు పట్టణంలో ఇంటి స్థలాలు అందించడం జరుగుతున్నదన్నారు. ఇందులో భాగంగా చుడా పరిధిలో గల కోడిగుంట ప్రాంతంలో 35ఎకరాలు సేకరించి అందులో ఉపయుక్తంగా ఉన్న 9ఎకరాలలో 85ప్లాట్‌లు ఏర్పాటు చేసి పంచడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపి రెడ్డెప్ప, మేయర్ అముద, డిప్యూటీ మేయర్‌లు రాజేష్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, ఏపీఎస్‌ఆర్టిసి మాజీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి, చుడా వైస్ చైర్మన్ విశ్వనాథ్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆలయ పాదాల మండపానికి భూమి పూజ

**ప్రజాశక్తి- చిత్తూరుడెస్క్:** నేత్రప్రదాయణీ క్షేత్రంలో అభివృద్ధి పనులు జరుగుతోందని మంత్రి ఆర్కేరోజా అన్నారు. మంగళవారం ఆలయంలో నిర్మించనున్న నూతన పాదాల మండపానికి ఆమె భూమి పూజ చేయడంతో పాటు రూ.41లక్షలతో నిర్మించిన జగనన్న సమావేశ మందిరాన్ని, రూ.7.25లక్షల నిధులతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. రూ.5 లక్షల నిధులతో ఆలయ పాదాల మండపం నిర్మిస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## రూ.22లక్షలతో పార్కు ఏర్పాటు

**ప్రజాశక్తి-సదుం:** సదుంలో రూ.22లక్షలతో నిర్మించిన నూతన పార్కును మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి, సోముశేఖర్‌రెడ్డి, యల్లప్ప, రెడ్డెప్పరెడ్డి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# దుంపలకు చిరునామ కొల్లాగుంట

- పెట్టుబడికి మించి ఆదాయం
- చీడ పీడలు ఆశించని పంట
- శివరాత్రికి ముందే పంటల ఒబ్బిడి



పొలంలో గెనిసి గడ్డలను నూర్పిడి చేస్తున్న రైతులు

**ప్రజాశక్తి-కార్వేటినగరం:** గెనిస, చేమగడ్డ, కావలిగడ్డ, కందగడ్డ ఇలా ఏ గడ్డలైనా ఆ గ్రామంలో దొరుకుతాయి. అక్కడి రైతులు కేవలం దుంపలను మాత్రమే ఆత్యధికంగా సాగుచేస్తారు. దుంపల సాగుకు అక్కడి నేల స్వభావం సహకరించడం, మార్కెటింగ్ సదుపాయం ఉండడంతో కార్వేటినగరం మండలంలోని కొల్లాగుంట గ్రామం దుంపల సాగుకు పుట్టినిల్లుగా ఉండేది. మహా శివరాత్రినాటికి పంటలు చేతికి వచ్చేలా రైతులు అదునుకు పంట వేసేవారు. అయితే ఈ ఏడాధి గెనిస గడ్డల సాగు సమయానికి వర్షాలు ఎక్కువగా రావడంతో పంట వేయడానికి కుదరక రైతులు శివరాత్రి సమయంలో ప్రతి ఏడాది వచ్చే వ్యాపారస్తులకు సమాదానం చెప్పుకోలేక పోతున్నారు.

### అనుకూల నేల స్వభావం..

కొల్లాగుంట సమీపంలోని నేల స్వభావం దుంపల సాగుకు అనుకూలం, కుశస్థలినదిని ఆనుకుని గ్రామం ఉండడంతో నీటి సమస్య లేదు. దుంపల పంటకు రోజు మార్చి రోజు నీరు అందించాలి. వరిసాగుతో పోలిస్తే ఈ పంటకు తక్కు నీళ్లు అవసరం.ఈ పంటకు ఎలాంటి చీడపీడల భయం లేదు.

### ఆదాయం ఎక్కువే..

వరి, వేరుశెనగ, సజ్జ, పొద్దుతిరుగుడు, పంటల కంటే దుంపల సాగుకు పెట్టుబడి తక్కువ ఆధాయం ఎక్కువగా ఉంటుంది. అన్ని రకాల వాతావరణ పరిస్థితులు ఈ పంట సాగుకు అనుకూలం. మార్కెటింగ్లో ఎప్పుడూ గిరాకీ ఉంటుంది. గెనిసిగెడ్డలు మినహా మూడురకాల గడ్డలు. ఆరు నెలలకుపైగా నిల్వ ఉంటాయి. దుంపలను బస్తాలెక్కన వ్యాపారస్తులు కొనుగోలు చేస్తుంటారు. బస్తాకు 90కేజీలు ఉంటాయి. ఎకరాకు 800నుంచి 1000కేజీల వరకు దిగుబడినిస్తుందని, గెనిస గడ్డలు, చేమ గడ్డలు ప్రస్తుతం బస్తా ధర రూ.900నుంచి 12వందల వరకు పలుకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. గెనిస సాగుకు ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేల మధ్య ఖర్చు అవుతుంది, ఆదాయం 60 నుంచి రూ.80వేల వరకు ఆదాయం వస్తుంది. కొల్లాగుంట గ్రామంలో సుమారు 40 కుటుంబాలకు పైగా గెనిసి గడ్డల సాగు చేస్తుంటారు. ఈ ఏడాది పంటల సాగుకు వాతావరణం అనుకూలించడంతో అధిక లాభాలు గడించినట్లు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

### అనుకూలించిన వాతావరణం



గతం కన్నా ఈ ఏడాది పంట వేసే సమయానికి వాతావరణం బాగా అనుకూలించడంతో పంట సాగు చేయడానికి నేల సహకరించి 80శాతం నుంచి వంద శాతం వరకు పంట దిగుబడి నిచ్చింది. అలాగే శివరాత్రికి ముందే పంట దిగుబడి రావడంతో వ్యాపారస్తులు గడ్డల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది అధిక దిగుబడి రావడంతో మంచి ఆదాయం వచ్చింది.

**చెంగారెడ్డి, రైతు, కొల్లాగుంట, కార్వేటినరం.**

# ఓపిఎస్‌ను తక్షణమే అమలు చేయాలి




**ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:** ఓపిఎస్‌ను తక్షణమే అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాణిపాకం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'మన ఓటు మన భవిష్యత్తు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఎన్నికల్లో మేనిఫెస్టోలో ప్రకటించాలని రాజకీయ పార్టీలను కోరారు. ఓపిఎస్ అమలు చేస్తామన్న రాజకీయ పార్టీలకు ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సురేష్‌బాబు, సురేంద్రబాబు, వినోద్‌లతోపాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నలుగురు విలేకరులపై కేసు

**ప్రజాశక్తి-వికోట:** మండలానికి చెందిన నలుగురు విలేకరులపై పోలీసుల అక్రమ కేసులు నమోదు చేశారు. సోమవారం రాత్రి వికోట పట్టణంలో నిర్వహించిన పుష్పపల్లకి ఊరేగింపు సందర్భంగా కవరేజీకి వెళ్లిన విలేకరులను పెద్దపంజాణి ఎస్ఐ శ్రీనివాసులు దురుసుగా ప్రవర్తించారు. కవరేజీకి వచ్చామని చెప్పినా దౌర్జన్యం చేసి విలేకరులపై విరుచుకుపడ్డారు. విచక్షణారహితంగా ప్రవర్తించారు. ఇదేంటని ప్రశ్నించిన విలేకరులపై తీవ్ర స్థాయిలో దూషించారు. ఇందతా చూస్తున్న కొంతమంది స్థానికులు, టీడీపీ నాయకులు కలగజేసుకొని వారు మీడియా కవరేజీకి వచ్చారు.. ఎందుకలా అని ప్రశ్నించేలోపు టీడీపీ కార్యకర్త చెంగప్పపై ఎస్ఐ దాడికి పాల్పడ్డాడు. గాయాలతో ఉన్న చెంగప్పను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. దీంతో అక్కడికక్కడే పెద్ద ఎత్తున స్థానికులు, విలేకరులు ఆ పోలీసుల తీరుపై నిరసన దిగారు. గాయాలతో చెంగప్ప ఆసుపత్రికి చేరడంతో విషయాన్ని అనచేందుకు నలుగురు విలేకరులు, 30మంది స్థానికులపై కేసు స్థానికులపై కేసు నమోదు చేశారు. కాగా మంగళవారం నుంచి విషయం ఆయా విలేకరుల సంఘాల ప్రతినిధులకు తెలియడంతో తిరుపతి, చిత్తూరుకు చెందిన విలేకరులు పోలీసుల తీరును ఖండించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి కేసులు ఉపసంహరించుకోవాలని, దౌర్జన్యం చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మంగళవారం సాయంత్రం వికోట కేంద్రంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద పలువురు విలేకరులు నిరసన తెలియజేసి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. సంఘటనలో గాయపడ్డ చెంగప్పను మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి పరామర్శించారు.



వికోటలో నిరసన తెలియజేస్తున్న విలేకరులు

# సూర్యప్రభపై శ్రీకాళహస్తీశ్వరుని విహారం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు రథంపై అధిరోహించి స్వామి వారిని అనుసరించారు. సూర్యప్రభ వాహనంపై పరమశివుడు విహరిస్తుండగా... మూషిక వాహనంపై వినాయకస్వామి, శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప చప్పరాలపై స్వామి, అమ్మవార్ల వెంట అనుసరించారు. మిరుమిట్లు గొలిపే రంగుల వలె కొత్త గొడుగులు, పదాతి దళాలు, మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు, కోలాటాలు, భజన బృందాలు ముందు నడుస్తుండగా... స్వామి, అమ్మ వార్ల పురవిహారం జనరంజకంగా సాగింది. పురవీధుల్లో ఊరేగుతున్న పార్వతీ పరమేశ్వరులను భక్తులు దర్శించుకున్నారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు, ఏఈవో లోకేష్, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, ఆలయ తనిఖీదారు హరిబాబు యాదవ్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




**నేడు రావణాసుర- మయూర వాహనం**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రావణ బ్రహ్మవాహనంపై పరమేశ్వరుడు మయూర వాహనంపై, జ్ఞానప్రసూనాంబ అమ్మవారు పురవీధుల్లో ఊరేగనున్నారు. లంకాధీశుడైన రావణబ్రహ్మపై ఆధిపత్యాన్ని చెలాయిస్తూ స్వామివారు, మయూర వాహనంపై అమ్మవారు కావనున్నారు. కాగా ఉదయం పరమేశ్వరుడు హంస వాహనం పైనా, పార్వతీదేవి యాళి వాహనం పైనా పురవీధుల్లో ఊరేగుతారు.

**నేడు గాంధర్వరాత్రి**

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ తిరునాళ్లను గాంధర్వరాత్రిగా పిలుస్తారు. గాంధర్వ రాత్రి అంటే రావణాసురుడు ప్రధాన భూమిక పోషించగా, నారద తుంబర్లతో పాటు గాంధర్వులు సమావేశమై సకల దేవ, భూత గణాల సమక్షంలో పరమేశ్వరుని కీర్తిస్తారు. ఈ నేపథ్యంలో స్వామివారు రావణాసురునిపై, అమ్మవారు మయూర వాహనంపై ఊరేగుతారు.

**భూత నాథునిపై శివయ్య వైభవం**

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి జగద్రక్షకుడైన పరమశివుడు గంగాదేవి సమేతుడై భూతవాహనంపై అధిరోహించి పురవిహారం చేశారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చిలుక వాహనంపై స్వామి వారిని అనుసరించారు. మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప, స్వామి, అమ్మవార్లను అనుసరించారు. అంతకు మునుపు ఆలయంలోని అలంకార మండపంలో పంచమూర్తులకు ఆలయ పురోహితులు విశేష అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం పురవిహారానికి తీసుకువచ్చారు. నూతన రాజగోపురం గుండా తేరువీధులోకి ప్రవేశించారు. ఆ తరువాత నెహ్రవీధి, నగరివీధి, బజారువీధి గుండా స్వామి, అమ్మవార్ల ఊరేగింపు జరిగింది. భూత, చిలుక వాహనాలపైన పురవిహారం చేస్తున్న శివ, పార్వతులను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎలుకా కొరకకే ప్లీజ్ ..

- కేజీబీవీలో విద్యార్థుల పాట్లు
- వరుస ఎలుక కాట్లుతో బెంబేలు
- మంగళవారం స్థానిక ఆసుపత్రిలో చికిత్స
- ఎలుకల నియంత్రణలో అధికారుల చర్యలు శూన్యం

**ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి:** పగలంతా తరగతి గదిలో పాఠాలు విన్న ఆ విద్యార్థులు రాత్రిల్లో హాస్టల్ గదిలోకి వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. నిద్రిస్తున్న సమయంలో చేతులు, కాళ్లపై ఎలుకలు కొరుకుతుండటంతో ఆ విద్యార్థుల్లో కలవరం మొదలైంది. రాత్రంతా కిచకిచ్.. కిచకిచ్.. అంటూ గదుల్లో ఆ ఎలుకలు స్వైరవిహారం చేస్తున్నాయని విద్యార్థుల వేదన. ఇదీ బైరెడ్డిపల్లి కేజీబీవీ పాఠశాలలో విద్యార్థుల పడుతున్న పాట్లు. ఇంత జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. నియంత్రించేందుకు కనీస చర్యలు చపట్టడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల నిర్లక్ష్యం వల్లే..

హాస్టల్ గదుల్లో ఎలుకలు ఉన్న విషయం అధికారుల దృష్టిలోనూ ఉంది. అయినా చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వస్తువులనూ పాడు చేస్తున్నాయి. ఎలుక కాట్లుకు గురైన విద్యార్థులు, విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పుకొని కన్నీరు పెట్టుకుంటున్నారు. ఇటీవల ఎలుకలు కొరకడంతో విద్యార్థులు స్థానిక వైద్యశాలలో వైద్యం అందుకున్నారు. మంగళవారం 9మంది 9వ తరగతి విద్యార్థులు ఎలుక కాట్లుకు గురవడంతో తల్లిదండ్రులు వారిని బైరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రికి వచ్చిన విద్యార్థులను చూసి అక్కడి వారు అధికారుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. ఎలుకల కోసం పాములు వస్తే ఎంటి పరిస్థితి అని ఒకింత ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతకీ అధికారులు పట్టించుకోలేదని, ఉన్నతాధికారులైనా స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. విషయం బయటకు చెప్పినట్లు తెలిస్తే ఉపాధ్యాయులు, పాఠశాల అధికారులు వేధిస్తారని విద్యార్థులు భయభ్రాంతులకు గురైయ్యారు.




బైరెడ్డిపల్లి కేజీబీవీ పాఠశాల

### ఇళ్లల్లో ఉన్నట్టే హాస్టల్లోనూ ఉన్నాయ్..

అందరి ఇళ్లల్లో ఎలుకలు ఉన్నట్లే హాస్టల్లోనూ ఉన్నాయి. కొంత మంది విద్యార్థులు ఎలుక కాట్లుకు గురవ్వడంతో వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఆసుపత్రిలో చికిత్స చేయించాం.

- స్వరూప, ఎస్‌వో, కేజీబీవీ పాఠశాల, బైరెడ్డిపల్లి

## పాఠశాల తనిఖీ

**ప్రజాశక్తి-సోమల:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో శివరత్నమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. హెచ్‌ఎం ఎల్లయ్య, ఉపాధ్యాయులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల ప్రవేశానికి దరఖాస్తులు

**ప్రజాశక్తి-రామకుప్పం:** మండలంలోని ఏపీ ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కృష్ణమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25విద్యాసంవత్సరానికి సంబంధించి దరఖాస్తులను ఈ నెల 31లోపు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలను సంప్రదించాలన్నారు.

## మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో చిత్తూరులోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిరణ్‌కుమార్, నాధముని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. "విద్యారంగంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర" అనే అంశంపై సదస్సు ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మెరుగైన వైద్యమే లక్ష్యం: డీఎంహెచ్‌వో

**ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు:** గ్రామ స్థాయిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి తెలిపారు. మంగళవారం మండలంలోని కొట్రకోన సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ్, పవన్‌కళ్యాణ్, శ్యామల్ జాన్, ఎంపీడీవో భాస్కర్, సిహెచ్ఓ శ్రీనివాసులు, సచివాలయ సెక్రెటరీ రజిని, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ సర్పంచ్ ముబారక్

**ప్రజాశక్తి-సోమల:** మండలంలోని నంజంపేట పంచాయతీ(జీడీవేల వంక) సరస్వతిపురం గ్రామంలో మంగళవారం చలివేంద్రాన్ని ఐస్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత కారణంగా పాదచారులు, వాహనదారులు దాహం తీర్చుకోవడానికి చల్లని మట్టి కుండలలో స్వచ్ఛమైన త్రాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేశామని సర్పంచ్ వెంకటరెడ్డి, వైస్ సర్పంచ్ ముబారక్ తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, అబ్బులేసలం, భాస్కర్‌నాయుడు, బాషా సాహెబ్, గంగాధరం, రెడ్డప్ప, నాగరాజా, రవికుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేశాం.. ఆదరించండి: ఎమ్మెల్యే



**ప్రజాశక్తి-వికోట:** అభివృద్ధి చేశాం ప్రజలందరూ ఆశీర్వదించాలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. మండలంలోని జవ్వనపల్లి పంచాయతీలో రూ.1.52కోట్లతో అభివృద్ధి పనులను నుంచి వుముందరపల్లికి నిర్మించిన సీసీరోడ్లను మంగళవారం ప్రారంభించారు. అదేవిధంగా అదే గ్రామానికి సంబంధించిన సచివాలయం, ఆర్‌బీకే భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, నాయకులు బాలగురునాథ్, తమీంఖాన్, లక్ష్మీకరరెడ్డి, నాగరాజు, శ్రీరాములురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## ఫైవ్ జీ టెక్నాలజీపై అవగాహన సదస్సు



**ప్రజాశక్తి-గంగవరం:** మండలంలోని మదర్ తెరిసా విద్యా సంస్థల్లో చదువుతున్న ఈసీఈ విభాగం విద్యార్థులకు బుధవారం నుండి ఐదు రోజులపాటు ఫైవ్ జీ టెక్నాలజీ పై అవగాహన కల్పిస్తున్నట్లు కరస్పాండెంట్ రవిచంద్రబాబు తెలియజేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకి రిసోర్స్ పర్సన్స్ పాల్గొంటారని, చెన్నై చెందిన అకాడమీ ఆఫ్ డిజిటల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన ప్రియ లింగేశ్వర్, బెంగళూరుకు చెందిన మిస్ టివి కళాశాల ప్రిన్సిపల్ రమణమూర్తి పాల్గొంటారని పేర్కొన్నారు. ఫైవ్ జీ టెక్నాలజీ విభాగంలో పలు అంశాలపై అవగాహన కల్పిస్తారని ఇందులో 200మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ అధిక రాజేందర్ రెడ్డి కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నకిలీ విలేకరి పై చర్యలు తీసుకోవాలి

**ఉపాధ్యాయ సంఘాల వినతి**



**ప్రజాశక్తి-నాయుడుపేట:** గత కొన్ని నెలలుగా ఓకే స్కూల్ పై అనవసరమైన ఆరోపణలు లేని రాతలు రాసి ఉపాధ్యాయులను తాను అడిగిన డబ్బులు ఇవ్వాలంటూ ఇబ్బంది పెడుతున్న ఒక నకిలీ విలేకరిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మనం పేరుతో నకిలీ వీడియో ఫేక్ పేపర్ కటింగ్ లతో బ్లాక్ మెయిల్ చేస్తున్న నకిలీ విలేకరి బిల్లి చిరంజీవులపై చర్యలు తీసుకోవాలంటూ నాయుడుపేట సిఐ శ్రీనివాసన్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఫిర్యాదు స్వీకరించిన నాయుడుపేట సీఐ అతనిపై చర్యలు చేపట్టి మరోసారి ఉపాధ్యాయుల ఇబ్బంది లేకుండా చూసు కుంటామని భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు యుటిఎఫ్ నాయుడుపేట మండల శాఖ అధ్యక్షులు కొనిరెడ్డి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు పేర్నేటి రామకృష్ణ, ఆరోయుపిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు గడదాసు వెంకటేశ్వర్లు, నాయుడుపేట సిపిఎం నాయకులు శివకవి, ముకుందా, చేపల వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, బిటిఏ జిల్లా నేత జె వెంకట్రావు, ఐద్వా మహిళా నేత చంద్రకళ, మున్సిపల్ యూనియన్ రమణయ్య, ఆటో యూనియన్ బుజ్జయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి విజయమ్మ ఉన్నారు.

## అభివృద్ధికి పెద్దపీట: ఎమ్మెల్సీ శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

**ప్రజాశక్తి-రామకుప్పం:** టీడీపీ అధికారంలోకి వస్తే అభివృద్ధికి పెద్దపీట వేస్తామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల పార్టీ నేతలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కుప్పంలో చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి నాయకుడు కార్యకర్త కృషి చేయాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రత్యర్థి పార్టీ ఎత్తుగడలపై వ్యూహాత్మకంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఆంజనేయరెడ్డి, మునస్వామి, ఆంజనేయరెడ్డి, నరసింహులు, చిన్నికృష్ణ, చలపతి, సీతాపతి, రామమూర్తి, నారాయణ, గంట్లప్ప గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు నుంచి మాజీ ఎమ్మెల్యేలను తరిమికొట్టండి: విజయానందరెడ్డి



**ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:** చిత్తూరు నుంచి మాజీ ఎమ్మెల్యేలను తరిమికొట్టాలంటూ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత పాలకులు చేసిన పాపాలతోనే చిత్తూరు చిత్తు చిత్తైందని నిప్పులు చెరిగారు. మంగళవారం చిత్తూరులో ప్రైవేటు టీచర్లతో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. తాజాగా పార్టీ మారడానికి సిద్ధపడ్డ ప్రస్తుత ఎమ్మెల్యేపై ఆయన మండిపడ్డారు. మూడు సార్లు ఓడి పోయాడని జాలితోనో, జగనన్నపై ఉన్న నమ్మకంతోనో చిత్తూరు ప్రజలు చూపించిన విశ్వాసాన్ని ఆయన వమ్ము చేశారన్నారు. చిత్తూరులో జనీవిని ఎరుగని రీతిలో అవినీతి, భూ కబ్జాలతో చిత్తూరును దద్దరిల్లేలా వ్యవహరించాడని అన్నారు. గత పాలకులలో సత్యప్రభ, మనోహర్‌లు మాత్రమే తమ శక్తి మేర తాము వ్యక్తిగతంగా చిత్తూరు అభివృద్ధికి ప్రాకులాడారని, మిగిలిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు చిత్తూరును సర్వనాశనం చేశారని తీవ్రంగా విమర్శించారు.

## కాపు సంక్షేమ సేనపై విశ్వాసం లేదు

**మాజీ కాపు సంక్షేమ శాఖ అధ్యక్షులు గంగుపల్లి వంశీ**

**ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):** రాష్ట్రంలోని కాపు బలిజలను అయోమయానికి గురిచేస్తూ వివాదాలకు కారణమవుతున్న కాపు సంక్షేమ సేనపై తమకు విశ్వాసం లేదని, జనసేనాని కోసమే అందులో కొనసాగామని మాజీ కాపు సంక్షేమ శాఖ తిరుపతి పట్టణ అధ్యక్షులు గంగుపల్లి వంశీ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హరి రామ జోగయ్య లేఖలు రాస్తూ కాపులలో చీలిక తేవడానికి కారణమవుతున్నారని దీనిపై జనసేన నాయకులు స్పందిస్తే కాపు సంక్షేమ సేన నుండి తనను, హిమవంతు, కొండ రాజమోహన్‌ను కాపు సంక్షేమ సేన నుండి తొలగిస్తున్నట్లు మీడియాకు లేఖలు విడుదల చేశారన్నారు. శతకోటి సంస్థల్లో కాపు సంక్షేమ సేన ఒకటేనని అందులో కొనసాగడం తమకు ఇష్టం లేదని తొలగింపు లేఖలను మీడియా ఎదుట చించి పడేశారు. పవన్ కళ్యాణ్ తన సొంత నిధులతో పార్టీ ఏర్పాటు చేసుకొని రాజకీయాలలో కొనసాగుతున్నారని, ఆయన ఎవరిని అడిగి పొత్తులు ఏర్పాటు చేసుకోవాలో చెప్పాలని జోగయ్యను డిమాండ్ చేశారు. తన కన్న కొడుకుని అదుపు చేయలేని జోగయ్యకు రాష్ట్ర కాపులను దిశా నిర్దేశం చేసే అర్హత లేదన్నారు. జోగయ్య కుమారుడు చేగుండి సూర్య ప్రకాష్ వైసీపీలో చేరుతూ పవన్ కళ్యాణ్‌పై దుమ్మెత్తి పోయడంపై హరి రామజోగయ్య ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కాపుల అభ్యున్నతి కోసం పాటుపడే పవన్ వెంట తాము కొనసాగుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాగరాజు రాయల్, సురేష్ పాల్గొన్నారు.

## 14వ వార్డు సమస్యలు పరిష్కరించాలి : కౌన్సిలర్

**ప్రజాశక్తి-వెంకటగిరి:** వెంకటగిరిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆరి శంకరయ్య పేర్కొన్నారు. వెంకటగిరి నడిబొడ్డిలో ఉన్న సర్వేనెంబర్ 215 అమ్మవారి పేట చెరువు 36 ఎకరాల 10 సెంట్లు స్థలం ఆక్రమ ఆ చెరువుపై ఆధారపడి ఉన్న మాగాన్ని వ్యవసాయ భూములు ప్రస్తుతం లేఅవుట్లు అవ్వడం వల్ల చెరువు పూర్తి స్థాయిలో నిరుపయోగంగా ఉంది. కుమ్మరి మిట్ట నుంచి చెరువుగట్టును చదును చేసి రాణి పేట వరకు ఈ రెండు ప్రాంతాలను కలుపుతూ రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేస్తే మిగిలిన చెరువు ప్రాంతాన్ని సుందరీ కరణ చేసి పార్కుగా తీర్చిదిద్దితే వెంకటగిరి కి మరో నిదర్శనం అవుతుంది చుట్టుపక్కల ప్రాంతాలు కూడా ఖాళీగా ఉన్న లేఔట్లు ఇల్లులు నిర్మించుకుని ఆ ప్రాంతం మొత్తం అభివృద్ధి అవకాశం ఉందని, తద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఈ పార్కును వెంకటగిరి ప్రజలకు బహుమతిగా ఇవ్వాలని వెంకటగిరి ప్రజలు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అయితేనే ఈ పనిని చేయగలరు అని వెంకటగిరి ప్రజలు విశ్వసిస్తున్నారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి వెంకటగిరి ప్రజల కోరికను నెరవేర్చాలని కోరారు.

## పిల్లల జీవితాలను నాశనం చేయొద్దు : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి - క్యాంపస్ :** పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు అనంతరం తల్లిదండ్రులు ఖర్చు పెట్టి మరి కార్పొరేట్ విద్యా సంస్థలలో చేర్పిస్తారని.. పిల్లల భవిష్యత్ బాగుండాలని కలలు కంటారని కానీ కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజుల మోత తో పాటు అన్ని మోసంతో కూడిన విద్య, ఒత్తిడి, ర్యాంక్, మార్క్ లలో విద్యార్థులను మానసికంగా హింసిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, జిల్లా ప్రధాన కార్యదర్శి భగత్ రవి అన్నారు. ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా కమిటీ సమావేశంలో కార్పొరేట్ విద్యా సంస్థల ప్రలోభాలకు గురి చేసి విద్యార్థుల జీవితాలను నాశనం చేయొద్దని ముద్రించిన కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ర్యాంక్, మార్క్ అంటూ ప్రచారం తప్ప విద్యార్థుల ఎదుగుదలకు ఏమాత్రం కృషి చేయకుండా జీవిత పాఠాలను చెప్పకుండా విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని వారు వాపోయారు. కార్పొరేట్ కళాశాల లో వివక్షత తో కూడిన విద్యా విధానం అమలు అవుతోందని దీనిపై ఆర్ఐఒ స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే కళాశాల లో వివిధ కోర్సులకు విచ్చలవిడిగా ఫీజుల వసూలు చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఫీజును బట్టి విద్యార్థులకు విద్యను అందిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారులు మొద్దు నిద్ర లేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, హరిత, ప్రసాద్, తేజ, జిల్లా నాయకులు సుష్మిత, ఉమేష్, గురువయ్య పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవాన్ని రాజకీయ పార్టీ సభగా జరపడం దారుణం

**- సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు**

**ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:** కుప్పంలో మహిళా దినోత్సవాన్ని అంగన్వాడీలతో నిర్వహిస్తూ రాజకీయాలు మాట్లాడటం దారుణమని మంగళవారం పుంగనూరులో విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం ప్రాజెక్టులో అధికారకంగా అంగన్వాడీలకు సెలవులు ప్రకటించి మహిళా దినోత్సవాన్ని జరిపిస్తే ఈ కార్యక్రమానికి అధికార పార్టీ ఎంపీ, ఎమ్మెల్సీలను రప్పించి రాజకీయాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే మహిళలు సమస్యలపై మాట్లాడలే గాని రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీ వారిని గెలిపించండి అని మహిళా దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడటం దారుణం అన్నారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన కార్యక్రమంలో రాజకీయాలు మాట్లాడటం బాధాకరమన్నారు. కుప్పం ప్రాజెక్టులో అనుక్షణం అంగన్వాడీలను వేధింపులకు గురిచేస్తున్న వారికి ఎలా సహాయం చేస్తారని ప్రశ్నించారు. ఇప్పుడే అంగన్వాడీలు గుర్తొచ్చారా అని ఆయన ప్రశ్నించారు. అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ కుప్పంలో అధికారులు స్పందించకపోవడం అలాంటివారికిపై చర్యలు తీసుకోకపోవడం ఎంపీకి కనపడలేదా అని ప్రశ్నించారు. స్థానిక శాసనమండలి సభ్యులు పేరు చెప్పి వేధింపులకు గురి చేసినవారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అలాగే ఎన్నికల కోడ్ వస్తుందని పేరుతో మహిళా దినోత్సవాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడానికి జిల్లాలో మంత్రులు కూడా తహతలాడుతున్నారని నగిరి మంత్రి కూడా మహిళా దినోత్సవం పేరుతో జరుగుతున్న కార్యక్రమానికి అంగన్వాడీల నుంచి రూ.300 నుంచి రూ.500 వరకు వసూలు చేయడం దారుణం అన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేసే దిశగా ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే జీవోలు విడుదల చేసి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## 'సత్ప్రవర్తనతో మెలగాలి'



వీడ్కోలు సమావేశంలో పాఠశాల విద్యార్థులు

**ప్రజాశక్తి-కార్వేటినగరం:** విద్యార్థి దశ నుంచి సత్ప్రవర్తనతో మెలగాలని శ్రీలక్ష్మీ నరసింహ విద్యాసంస్థ కరస్పాండెంట్ దిలీప్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావడానికి కృషి చేయాలని సూచించారు. హెచ్‌ఎం మహేశ్వరరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైందన్నారు. అనంతరం సరస్వతి పూజ నిర్వహించి కొవ్వొత్తులు వెలిగించారు. వీడ్కోలు సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ధనుంజయరెడ్డి, పురుషోత్తం, రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 24గంటల విద్యుత్ సరఫరాకు చర్యలు

**- ట్రాన్స్కో అధికారులకు ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు ఆదేశం**



**ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:** రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని 24గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఇప్పటి నుంచి చర్యలు చేపట్టాలని ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా చిత్తూరు నగరంలోని తోటపాళ్యం సబ్ డివిజన్ ఏపీ ట్రాన్స్కో కార్యాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం లేకుండా నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. వేసవి దృష్ట్యా ఎక్కడ ఎలాంటి అనివార్య సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు ట్రాన్స్ఫార్మర్లు తనిఖీ చేస్తూ ఉండాలని, అర్బన్ ప్రాంతాలలో 24గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని రైతుల విద్యుత్ కనెక్షన్లకు ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలన్నారు. వీటితో పాటు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కస్టమర్ చార్జీల బకాయిల వసూళ్లు, వర్క్ ఆర్డర్లను పూర్తి చేయడం, అదనపు లోడ్డు మంజూరు, విద్యుత్ చౌర్యం అరికట్టడం తదితర అంశాలపై సైతం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కాగా ఈ సమావేశంలో ఈఈలు పద్మనాభపిళ్ళై, హరి, చిత్తూరు అర్బన్ డిఈ శేషాద్రిరెడ్డి ఇతర డివిజన్ల డిఈలు, ఏడీలు, ఏఈలు, సబ్ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజానాడి గుర్తించి నగరి టికెట్ ఇవ్వండి

**అధిష్టానానికి వైసిపి నాయకుల వినతి**



మాట్లాడుతున్న వడమాలపేట జెడ్‌పిటిసి మురళీధర్‌రెడ్డి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ప్రజానాడిని గుర్తించి నగరి టికెట్ ఇవ్వాలని అధిష్టా నానికి వైసిపి నాయకులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగిరి నియోజకవర్గ పరిధిలోని విజయ పురం, పుత్తూరు, నింద్ర, వడమాల పేట, వైసిపి కీలక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడమాలపేట జెడ్‌పిటిసి మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజానాడిని గుర్తించి నగరి టిక్కెట్ ఇవ్వాలని కోరారు. నగరి నియోజకవర్గంలో ప్రస్తుత మంత్రి రోజాను గెలిపించడానికి ఆస్తులను అమ్ముకొని కష్టపడ్డామని, 'నాకు ఐదుగురు అన్నదమ్ములు అని ప్రతి సభల్లో ఊదరకొట్టిన రోజా ఇప్పుడు మా ఐదు మండలాలకు సంబంధించిన ఐదుగురిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని వడమాలపేట జెడ్పిటిసి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు మురళీధర్ రెడ్డి, రెడ్డివారి భాస్కర్ రెడ్డి, ఏలుమలై, రవిశేఖర్ రాజు మాట్లాడుతూ 2004 నుండి 2009 వరకు టిడిపిలో ఉన్న రోజా అప్పటి కాంగ్రెస్ దెబ్బకు ఓటమిపాలైందని, అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డిని కలిసి కాంగ్రెస్‌లో చేరారని, వరుసగా ఓటమిపాలైన రోజాకు బాసటగా నిలిచామని, ఐరన్ లెగ్ గా పేరు పొందిన రోజాను గోల్డెన్ లెగ్‌గా మార్చి ఎమ్మెల్యే, మంత్రిగా చేశామన్నారు. కానీ ఆ నాడు 'ఐదుగురు అన్నదమ్ములు నాకు ఉన్నారు' అని చెప్పిన రోజా, నేడు నియోజకవర్గాన్ని తన అక్రమ ఆర్జనకు అడ్డగా చేసుకొని తమని పక్కకు నెట్టేసిందన్నారు. అంతా ఆమె ఆధిపత్యం సాగుతోందని, తమ కష్టాన్ని మరిచిపోయి ...స్తోందన్నారు. వైసిపికి పనిచేస్తామే కానీ, ఇలా నగరి నియోజకవర్గాన్ని దోచుకోవడానికి అడ్డాగా చేసుకున్న రోజాకు సహకరించబోమని హెచ్చరించారు. ఈ క్రమంలో వైసీపీ అధిష్టానం ప్రజానాడిని గుర్తించి ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తేనే సత్ఫలితాలు ఉంటాయని, లేకుంటే నగరి సీటు కోల్పోవాల్సి వస్తుందన్నారు. తాము గొంతెమ్మ కోర్కెలు కోరుతున్నామని, తమపై నిందారోపణలు మోపుతున్న మంత్రి రోజా ఓపెన్ డిబేట్‌కు రావాలని సవాల్ విసిరారు. 'మీరంతా నాకు అండగా నిలబడకపోతే ఓడిపోతాను' అని కన్నీళ్లు పెట్టుకున్న రోజా నేడు తమకు కన్నీళ్లు తెప్పించేలా ప్రవర్తిస్తున్నారన్నారు. నగరిలో మంత్రి రోజా పట్ల ప్రజలు సానుకూలంగా లేరని, తాము ప్రజలను అనుసరించి నడుచుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వాసుదేవ రెడ్డి, మునీంద్ర, లక్ష్మీపతిరాజు, శ్రీధర్ రాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## తాగునీటి కుళాయిని పునరుద్ధరించాలి: సిపిఎం



ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, విద్యార్థులు

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న తాగునీటి కుళాయిని పునరుద్ధరించాలని సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ పుత్తూరు నడి బొడ్డున తాగునీటి కుళాయిని మున్సిపల్ అధికారులు నిలిపివేయడం ప్రజల తాగునీటిని అడ్డుకోవడమేనన్నారు. అంబేద్కర్ సర్కిల్‌లో ఈ కుళాయి ఆపివేయడంతో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగులు, వృద్ధులు, విద్యార్థులు, వికలాంగులు, వ్యాపారస్తులు, ఆటో కార్మికులు, పుత్తూరులో నడుస్తున్న ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడే ఎండలో తీవ్రం కావడం వల్ల తాగునీటికి పుత్తూరు పట్టణం లో ఇబ్బందులు పడు తుంటే ఉన్న కుళాయిని మున్సిపల్ అధికారులు మూసివేయడం అన్యా యమని ఆవేదన వ్యక్తం చేశా రు. ఇప్పటికైనా మున్సి పల్ కమిషనర్, ఏఈ స్పం దించే వెంటనే ఆ కుళాయిని పునరుద్ధ రించాలని లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై నందయ్య, ఏ విజయ్, సుధాకర్, మనోహర్, కృష్ణమూర్తి, ఏ రవి, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## మార్పుతోనే మహిళా సాధికారత: మాజీ ఉపరాష్ట్రపతి

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** సమాజం దృష్టి కోణంలో మార్పుతోనే మహిళా సాధికారత సాధ్యమౌతుందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు దిశానిర్దేశం చేశారు. సంప్రదాయాలు మంచివే కానీ, సాధికారతకు అడ్డంకిగా మారిన కొన్ని సాంఘిక అంశాల విషయంలో పునరాలోచన జరగాలని సూచించారు. రాష్ట్రీయ్ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళ స్వయం ఉపాధి కోసం రుణాలను అందించారు. వారంతా జీవితంలో ఉన్నతస్థాయిని చేరుకోవాలని వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. ప్రజాసంక్షేమం, అణగారిన వర్గాలు, మహిళల అభ్యున్నతే లక్ష్యంగా గత నాలుగున్నర దశాబ్దాలుగా రాస్ సేవలు అందిస్తుండటం అభినంద నీయమన్నారు.

## విజిలెన్స్ అధికారుల దాడి

**పెట్రోలు బంకు సీజ్**

**ప్రజాశక్తి -బాలాయపల్లి :** మండల కేంద్రంలో ఉన్న భారత్ పెట్రోల్ బంకు లో డీజిల్ ,పెట్రోలు తక్కువ పడుతున్నారనే సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు పది రోజుల క్రితం దాడులు చేసి డీజిల్, పెట్రోల్ తక్కువ పట్టడం వస్తాయని నిర్ధారణ చేసి పెట్రోల్ బంకును ముసేశారు. దీంతో మండల కేంద్రం చుట్టూ ఉన్న పల్లెల ప్రజలు పెట్రోలు డీజిల్ కోసం పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. మనిషి జీవనార్థమై పెట్రోల్, డీసలు నిత్యవస రమైంది అదే అణువుగా చూసుకొని బాలా యపల్లి మండల కేంద్రంలో ఉన్న పెట్రోల్ బంక్ యాజమాన్యం ప్రజలను మోసం చేస్తూ లీటర్ పెట్రోల్ కు 100 మిల్లీ లీటర్లు తక్కువ పట్టడం గమనించిన ప్రజలు విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విజిలెన్స్ అధికారులే స్వయంగా వచ్చి లీటర్ బాటిలలో ఒక లీటర్ పెట్రోల్ పట్టించుకున్నారు అందులో 100 మిల్లీ లీటర్లు, తక్కువ రావడం గమనించి. ఐదు లీటర్ల క్యాన్ లో కాన డీజిల్ పట్టారు. అందులో అర్ధలీటరు తక్కువ రావడంతో వెంటనే పెట్రోల్ బంకును సీజ్ చేశారని తెలిపారు.

## తలకోన శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**ప్రజాశక్తి-యర్రావారిపాలెం:** తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం అంకురార్పణతో ఘనంగా ప్రారం భించారు. ఐదు రోజులు పాటు నిర్వహించే ఈ శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. శాస్త్రం ప్రకారం బహుళ చతుర్దశి పుట్ట మన్నుతో నవధాన్యాలు సేకరించి వేద పండితులచే మంత్రాలు నడుమ శివరాత్రి ఉత్సవాలు ప్రారంభించినట్లు ఈవో జైకుమార్ పేర్కొన్నారు. వారం రోజులపాటు శివరాత్రి జాగరణ, కల్యాణోత్సవం, సిద్ధ పూజ, మారుపొంగల్లు జరుగుతాయని ఆయన తెలిపారు. భక్తులకు తాగునీరు, వైద్య సౌకర్యం, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకి పీలేరు, తిరుపతి, రాయచోటి, కోడూరు, ఆర్టీసీ డిపోల నుండి స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశామని, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు కల్పించామని తెలిపారు. అన్నదానం స్థలం వరకు మాత్రమే గుడి సమీపంలోకి వాహనా లకు అనుమతి ఉంటుం దని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్ఐ ఈశ్వర య్యా తెలిపారు. గుడి ఆవరణ నుంచి మూడు కిలోమీటర్ల మేర రోడ్డుకి ఇరువైపులా విద్యుత్ లైటింగ్ భక్తులకు సౌకర్యం గా ఉండే విధంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, పాలక మండలి సభ్యులు జయంత్, నాగిరెడ్డి, ప్రధాన అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆలయంలో అన్నదానం

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** స్థానిక శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి ఆలయంలో మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామిని దర్శించి అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి బాబు వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

## మద్యం స్వాధీనం



**ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:** అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవి సుబ్బరాజు తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అందిన సమాచారం మేరకు.. పెనుమూరు మండలం ఉగ్రహాణంపల్లెకు వెళ్లే దారిలోని ఓ స్థలంలో పాతిపెట్టిన అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అదే గ్రామానికి చెందిన నిందితుడు శివకోటిరెడ్డి(45)ని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. సీఐ విజయ్‌కుమార్, ఎస్ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## యువతి ఆత్మహత్య

**ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:** నగరంలోని మిట్టూరులో నివాసం ఉంటున్న మదనపల్లి చెందిన విశ్వేశ్వర్ రెడ్డి కుమార్తె పూజిత నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. గదిలో ఒంటరిగా ఉన్న పూజిత మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు ఆయనకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వన్ టౌన్ ఎస్ఐ షేక్షావల్లి సంఘటనా స్థలాన్ని చేరుకుని దర్యాప్తును ప్రారంభించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చెట్టును ఢీకొన్న కారు

**ఫార్మసి విద్యార్థిని మృతి, మరొకరికి గాయాలు**

**ప్రజాశక్తి-వెదురుకుప్పం:** ప్రమాదవశాత్తు అదుపుతప్పిన కారు ఓ చెట్టును ఢీకొంది. ఘటనలో ఫార్మసి విద్యార్థిని దుర్మరణం పాలైంది. స్థానికుల కథనం మేరకు.. చిత్తూరులోని ఓ ఫార్మసి కళాశాలలో బీఫార్మసి సెకండ్ ఇయర్ చదువుతున్న ధన్య మంగళవారం పుత్తూరులో పరీక్ష రాసింది. తిరిగి చిత్తూరుకు త్రిసు అనే యువకుడితో కారులో వస్తోంది. ఎస్ఆర్‌పురం మండలం సికెపురం వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఘటనలో ధన్య అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలతో ఉన్న త్రిసును స్థానికులు చిత్తూరుకు తరలించారు. ఆ యువకుడు చిత్తూరు జెసీ కార్యాలయంలో టెంపరరీ అటెండర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.